నవతెలంగాణ

1

ఆదిలాబాద్

మంగళవారం | అక్టోబర్ 17, 2023 | www.navatelangana.com

నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన జెడ్పీటీసీ

నవతెలంగాణ-తలమడుగు

కోసాయి గ్రామంలో కొలాం తెగకు చెందిన టేకం లక్ష్మిబాయి ఇల్లు కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో సోమవారం జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి పరామర్శించి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో గిరిజన మహిళకు ప్రభుత్వం తరపున ఇల్లు మంజూరు చేసే ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ సుభాష్, ఎంపీటీసీ వెంకన్న, మాజీ ఎంపీటీసీ దాదారావు, దత్తు, ప్రకాష్ ఉన్నారు.



కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కంకెట, వైకుంఠపూర్ గ్రామాలలో సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి శ్రీహరిరావు కుమార్తె మాధురి ఇంటింటా ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కరపత్రాన్ని చూపుతూ ప్రజల కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే వారిని గెలిపించాలని గ్రామస్తులను కోరారు. అన్ని వర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హాది, మారుతీ, విలాస్‌రావు, బొల్లోజు నర్సయ్య, ముత్యంరెడ్డి, సుభాష్‌రెడ్డి, గుర్రాల రాజు, సలీం, సురేందర్, జాదవ్ లక్ష్మణ్, అబ్దుల్, రాథోడ్ రాజారామ్, ఆడే లచ్చిరాం, ప్రశాంత్ పాల్గొన్నారు.



మేనిఫెస్టో వార్..!

- హామీల వర్షం కురిపించిన బీఆర్ఎస్
- ఆరు గ్యారెంటీలను నమ్ముకున్న కాంగ్రెస్
- ఇరు పార్టీల వైఖరిపై జనంలో ఆసక్తికర చర్చ
- పోటాపోటీ ప్రచారంతో జిల్లాలో రాజకీయ వేడి

సార్వత్రిక ఎన్నికల క్రతువు రోజురోజుకు వేడెక్కుతోంది. ముఖ్యంగా రాష్ట్రంలో అధికార పక్షమైన భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్), ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోలు ప్రజల్లో తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. పోటాపోటీగా వరాల వర్షం కురిపించడంతో జనంలో ఆసక్తి నెలకొంది. ఇరు పార్టీలు ఇచ్చిన హామీలు ప్రజలకు మేలు చేసేవే కావడంతో ఎవరిని నమ్మాలో తెలియక జనం అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం ఏ నలుగురు కలిసినా ఈ పార్టీల మేనిఫెస్టోలపైనే చర్చ జరుగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తొలుత ఆరు గ్యారెంటీల పేరుతో మేనిఫెస్టో విడుదల చేసింది. రానున్న ఎన్నికల్లో గెలిపిస్తే వీటిపై తొలి సంతకం చేస్తామని కాంగ్రెస్ చెబుతోంది. మరోపక్క వీటిని మించిపోయేలా అధికార బీఆర్ఎస్ పార్టీ రెండు రోజుల క్రితం మేనిఫెస్టోను విడుదల చేయడం సర్వత్రా చర్చకు దారితీస్తోంది. హామీలపై పోటాపోటీ ప్రచారం నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందేందుకు ఇరు పార్టీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తాటిని తన్నే వాడు ఉంటే..దాని తలదన్నే వాడు ఇంకొకడు ఉంటారనే సామెత తరుచూ వినిపిస్తుంటుంది. అచ్చం అలాగే ఉంది ప్రస్తుత రాజకీయ పార్టీల పరిస్థితి. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీ మేనిఫెస్టోలు ప్రకటించడంతో జనంలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. అధికారంలోకి రావాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీల ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది.ఇందులో భాగంగా అధికారంలోకి వస్తే వీటిపైనే తొలి సంతకం చేస్తామని ఆ పార్టీ అధిష్టానం చెబుతోంది. రైతు భరోసా పేరిట రైతులు, కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేల ఆర్థికసాయం అందించడం, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, వరి పంటకు బోనస్ కింద రూ.500లు అందజేస్తామని వెల్లడించింది. మహాలక్ష్మీ పేరిట ప్రతి మహిలకు నెలకు రూ.2500, గ్యాస్ సిలిండర్ రూ.500కే అందించడం,ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రవేశం కల్పించడం, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇళ్లు లేని వారికి ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం, తెలంగాణ ఉద్యమ కారులకు 250గజాల ఇంటి స్థలం, గృహజ్యోతి కింది ప్రతి కుటుంబానికి 200యూనిట్ల ఉచిత విద్యుత్, చేయూత కింద నెలవారీ పింఛన్ రూ.4వేల చొప్పున, రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా సౌకర్యంతో పాటు యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5లక్షల విద్యాభరోసా కార్డు, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు వంటి పథకాలు మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఇక వీటిని మించిపోయేలా బీఆర్ఎస్ తన మేనిఫెస్టోలోనూ వరాల జల్లు కురిపించింది. రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ, కేసీఆర్ బీమా పేరిట రూ.5లక్షల జీవితబీమా సౌకర్యం కల్పించడం, ఆసరా పింఛన్లు దివ్యాంగులకు రూ.6016చొప్పున, ఇతరులకు ఐదేండ్లలో రూ.5వేలకు పెంచడం, రైతుబంధు ఎకరానికి ఐదేండ్లలో రూ.15వేల చొప్పున అర్హులైన మహిళలకు రూ.3వేల భృతి, రూ.400కే గ్యాస్ సిలిండర్ పంపిణీ, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.15లక్షలకు పెంచడం, పేదలకు ఇండ్ల స్థలాలు, అగ్రవర్ణ పేదలకు రెసిడెన్షియల్ స్కూల్‌లు, మహిళా సమాఖ్యలకు సొంత భవనాలు, ఉద్యోగుల సీపీఎస్‌పై అధ్యయన కమిటీ ఏర్పాటుచేయడం వంటి హామీలు గుప్పించింది.

జనంలో ఆసక్తికర చర్చ..!

రాష్ట్రంలో రెండు దఫాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లూరుతుండగా.. రెండు సార్లు ప్రతిపక్షానికే పరిమితమైన కాంగ్రెస్ పార్టీ ఈ సారి అధికారంలోకి రావాలని గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే అధికార బీఆర్ఎస్ పది అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్ పార్టీ తొలి విడతలో మూడు స్థానాలకు అభ్యర్థులను వెల్లడించింది. మిగితా ఏడింటిలో ఖరారు చేసేందుకు కసరత్తు చేస్తోంది. మరోపక్క కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు టికెట్‌పై ఆశలు పెట్టుకున్న వారు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇటీవల మేనిఫెస్టో ప్రకటించడంతో బీఆర్ఎస్ అభ్యర్థులు సైతం ఇది వరకు చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు తాజాగా రానున్న ఎన్నికల్లో అమలు చేయనున్న హామీలపై ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇరు పార్టీలు వారి హామీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. దీంతో ఇరు పార్టీల వైఖరిపై జనంలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఎవరు అధికారంలోకి రావాలి..ఎవరు వస్తే బాగుంటుందో ప్రజలు బేరీజు వేస్తున్నారు. త్వరలోనే ఏ పార్టీని ఆదరించనున్నారో తేలిపోనుంది.





అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద డీసీపీ తనిఖీలు



నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని రాపన్‌పల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందితో కలిసి సోమవారం డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఉండాలన్నారు. అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద నిరంతరం నిఘా ఉంటుందని, మద్యం, డబ్బు రవాణా చేసినట్టు తెలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో ఎవరైన కొత్త వ్యక్తులకు ఆశ్రయ ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మావోయిస్టుల ప్రలోభాలకు ఎవరూ ఆకర్షితులు కావద్దన్నారు. ప్రజలకు పోలీసులు ఎప్పుడు రక్షణగా ఉంటారని, ఎప్పుడు ఏ సమస్య వచ్చినా 100కు సమాచారం ఇవ్వాలని అన్నారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణ వైపు డబ్బులు తీసుకొచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చర్య తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి వాహనాన్ని, ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే రాష్ట్రంలోకి అనుమతిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసిపి మోహన్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, కోటపల్లి ఎస్ఐ సురేష్, నీల్వాయి ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.

కోడ్‌కు కార్మికుల లాభాల వాటకు సంబంధం లేదు

- ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఎస్‌కే బాజీ



నవతెలంగాణ-జైపూర్

ఎన్నికల కోడ్‌కు సింగరేణి కార్మికుల లాభాల వాటకు సంబంధం లేదని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి ఎస్‌కే బాజీ అన్నారు. సోమవారం ఐకే-1ఏ గని మేనేజర్ కార్యాలయం ద్వార సింగరేణి సీఅండ్ఎండీ ఎన్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి గని కార్మికులకు చెల్లించాల్సిన 32 శాతం లాభాల వాట సొమ్ము వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లాభాల వాటకు ఎన్నికల కోడ్‌కు ఎలాంటి సంబంధం ఉండదన్నారు. అక్టోబర్ 4న జారీ చేసిన సర్క్యూలర్ ప్రకారం ఈ నెల 16న సింగరేణి కార్మికులకు లాభాల వాట చెల్లించాల్సిఉందన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధన అంటూ లాభాల వాట చెల్లింపు వాయిదా వేస్తున్నట్లు యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు. పండుగకు ముందు లాభాల వాట అందుతుందని ఆశించిన కార్మికులకు యాజమాన్యం తీసుకున్న నిర్ణయం నిరాశకు గురి చేసిందని ఆవేధన వ్యక్తం చేశారు. 9న ఎన్నికల కోడ్ ప్రకటించగా 4న యాజాన్యం లాభాల వాట చెల్లింపును ప్రకటించిన తీరును గమనించాలన్నారు. అదేవిధంగా ఎన్నికల కమీషన్ జారీ చేసిన కోడ్ ఆఫ్ కండక్ట్ సర్క్యూలర్‌లో ఉన్న 13 అంశాల్లో ఎక్కడ కూడా కార్మికుల లాభాల వాట చెల్లింపుకు అడ్డు రావడం లేదన్న గుర్తించాలన్నారు.

22న సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు

నవతెలంగాణ-రెబ్బెన

ఈ నెల 22న సింగరేణి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలను నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ తెలిపారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సింగరేణి హైస్కూల్ మైదానం, మాదారం రామాలయ ప్రాంగణంలో వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా అందంగా అలంకరించి వచ్చిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. 10 బతుకమ్మలకు కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. 22న సాయంత్రం 6 గంటల నుంచి వివిధ రకాల కార్యక్రమాలతో పాటు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు, సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండలంలోని హుడ్కిళి గ్రామానికి చెందిన మతిస్థితిమితం లేని నైతం రమేష్(38) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ దీకొండ రమేష్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కౌటాల మండలం మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన నైతం రమేష్‌కు సిర్పూర్ మండలంలోని హుడ్కిళి గ్రామానికి చెందిన మడావి మమతతో కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమార్తె అశ్విని, కుమారుడు రోహిత్ ఉన్నారు. మొగడ్‌దగడ్ గ్రామంలో ఉపాధి లేకపోవడంతో అత్తగారి ఊరైన హుడ్కిళిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఐదు సంవత్సరాల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. సోమవారం భార్యాభర్తలు ఇద్దరు పిల్లలతో కలిసి చేనుకు వెళ్లారు. భార్య వరి చేనులో కలుపు తీస్తుండగా దూరంగా ఉన్న భర్త రమేష్ పురుగులమందు తాగి కిందపడిపోయాడు. గమనించిన కుమారుడు రోహిత్ కేకలు వేయడంతో భార్య గమనించి చుట్టుపక్కల వారిని పిలిచింది. అప్పటికే మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

శ్రమదోపిడీకి గురిచేస్తున్న యాజమాన్యం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణిలో చాలీచాలని వేతనాలు తీసుకుంటూ బొగ్గును రవాణా చేస్తూ సంస్థ అభివృద్ధి చెందడంలోనూ లారీ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు, క్లీనర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ అన్నారు. సోమవారం సింగరేణి బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్‌కు సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్లు, క్లీనర్లు(ఏఐటీయూసీ) యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ మాట్లాడుతూ సింగరేణిలోని బెల్లంపల్లి ఏరియాలో ఖైరిగూడ ఓపెన్‌కాస్టు నుండి గోలేటి సీహెచ్‌పీకి, ఇతర ప్రాంతాలకు బొగ్గును రవాణా చేస్తున్న లారీ డ్రైవర్లను, క్లీనర్లను యాజమాన్యం శ్రమదోపిడికి గురిచేస్తుందన్నారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులకు హైపర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు కనీస వేతనం రూ.32 వేలు, క్లీనర్లకు రూ.18 వేలు చెల్లించాలని, లాభాల వాటాలో వాటా కూడా ఇవ్వాలని, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సీఎంపీఎఫ్ ఆస్పత్రి సౌకర్యం కల్పించాలని, ఈసీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం అమలుచేయాలన్నారు. కార్మికులందరికి బోనస్ సౌకర్యం కల్పించాలని, అలాగే ప్రతినెల 10వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, చెల్లించని ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదబీమా, ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు ఇవ్వాలని, సింగరేణిలో క్యాంటీన్ సౌకర్యం కల్పించాలన్నారు. 8 గంటల పని విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను ఈ నెల 29లోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో 30 తరువాత ఏ రోజు నుండైనా నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్టు లారీ డ్రైవర్లు, క్లీనర్ల యూనియన్ అధ్యక్షుడు అరికిల్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే గౌస్, ఉపాధ్యక్షుడు రవిప్రసాద్ గౌడ్, లచ్చన్న, జాయింట్ సెక్రటరీ టి కృష్ణ, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ - కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసేపేట-2 ఇంక్లైన్ గనిపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. లాభాల వాటా వెంటనే అమలు పరచాలని ఏజెంట్ రాందాస్, మేనేజర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి మాట్లాడుతూ కార్మికులు ఎదురు చూస్తున్న లాభాల వాటాను సింగరేణిలో వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీల కుట్రలో భాగంగా కార్మికుల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడిందని, కావాలనే జాతీయ సంఘాలు టీబీజీకేఎస్, బీఆర్ఎస్‌పై విష ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. కార్మికులు వాళ్లను నమ్మే పరిస్థితిలో లేరని, జాతీయ సంఘాలు గ్రహించాలన్నారు. టీబీజీకేఎస్ ఎప్పుడూ కార్మికుల కోసం పాటు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సహాయ ఫిట్ సెక్రెటరీ సారంగపాణి, గుమాస తిరుపతి, మాస్క రమేశ్, గోపాలకృష్ణ, కమల్, రాజు, అంజి, పోశం, అశోక్ పాల్గొన్నారు.



రెబ్బెన : సింగరేణి ఉద్యోగులకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన లాభాల వాటాను వెంటనే చెల్లించాలని టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలను అందించారు. సోమవారం ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్, గోలేటి సీహెచ్‌పీ, జీఎం కార్యాలయం సివిల్ డిపార్టుమెంట్లలో, వర్క్‌షాప్, ఏరియా స్టోర్లలో ఆయా సంబంధిత అధికారులకు ఫిట్ కార్యదర్శులు కార్నాదం వెంటకేశం, మెరుగు రమేష్, మంకయ్య, కందుల తిరుపతి, విజ్ఞన్న వినతిపత్రాలు అందించి లాభాల వాటాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేయస్ ఏరియా నాయకులు గజ్జల చంద్రశేఖర్, మారిన వెంటకేశం, మాంతు సమ్మయ్య, అలవేని సంపత్, వరలక్ష్మి భాగ్యలక్ష్మి, భాస్కరచారి, మోర్లె సత్యనారాయణ, మొగులయ్య రాజేశం, బొంగు వెంకటేశం, కమిటీ సభ్యులు దాస్, వైకుంఠం, శ్రీనివాస్, రసూల్, రాజేష్, సురేష్, రాజం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాభిష్టానికి అనుగుణంగా బీఆర్ఎస్ మేనిఫెస్టో

- కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొడుతుంది : ఎమ్మెల్యే రామన్న



నవతెలంగాణ- ఆదిలాబాద్‌అర్బన్

ప్రజాభీష్టానికి అనుగుణంగా సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను రూపొందించారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్, బీజేపీలు విఫలమయ్యాయని, ఆ పార్టీలకు ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీల వివరాలను వెల్లడించడంతో పాటు ప్రతిపక్ష పార్టీల తీరును ఎండగట్టారు. అన్ని వర్గాల వారికి అండగా నిలిచేలా తమ నాయకుడు మేనిఫెస్టోను రూపొందించారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 90లక్షల కుటుంబాలకు ధీమా కల్పించేలా రూ.5లక్షల జీవిత బీమా అందించనున్నారని తెలిపారు. సౌభాగ్య మహిళా పథకం కింద అర్హులైన మహిళలకు రూ.3వేల ఆర్థిక సాయం అందించనున్నారన్నారు. రూ 400కే గ్యాస్ సిలిండర్, అగ్రవర్ణ పేదల కోసం 119 రెసిడెన్షియల్ స్కూళ్లు, దశల వారీగా రూ.5వేల ఆసరా పెన్షన్లు అందజేత, రైతుబంధు ఆర్థిక సహాయాన్ని రూ.15వేలకు పెంచడం, ఆరోగ్యశ్రీ కింద రూ.15లక్షలకు గరిష్ట పరిమితి పెంపు వంటి ప్రజాకర్షక హామీలను మేనిఫెస్టోలో పొందుపర్చారన్నారు. దివ్యాంగులకు సైతం రూ.6,016 పెన్షన్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మేనిఫెస్టోపై టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కర్ణాటకలో బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన మాట వాస్తవమా కాదా? అని ప్రశ్నించారు. ఉచిత రేషన్, డిప్లొమా చేసిన వారికి భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమయిందని మండిపడ్డారు. అటు బీజేపీ సైతం ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసిందని గుర్తు చేశారు. ఉజ్వల పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్, రైతులకు ఆదాయం రెట్టింపు హామీలను బీజేపీ పూర్తిగా విస్మరించిందన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఘనత సీఎం కెసిఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వందకు పైగా సీట్లలో విజయం సాధిస్తామని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పట్టణ అధ్యక్షులు అజయ్, మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, వేణుగోపాల్ యాదవ్, నాయకులు గంగారెడ్డి, స్వరూపరాణి, శివ, రాజన్న, ఫర్వీన్ పాల్గొన్నారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-కడెం

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ అలెగ్జాండర్ అన్నారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన ఫరీద్ అహ్మద్ (బాబు) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వారి జ్ఞాపకార్థం కడెం ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ అలెగ్జాండర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కడెం సర్పంచ్ అనూషాలక్ష్మణ్, ఉప సర్పంచ్ ఆజాం, నాయకులు రవి, సతీష్ పాల్గొన్నారు.



పట్టణ రెండవ ఎస్సైగా స్వరూప్‌రాజ్

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణ పోలీస్ స్టేషన్ నూతన రెండవ ఎస్సైగా ఎస్ స్వరూప్‌రాజ్ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మందమర్రి సీఐ మహేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సీఐ నూతన ఎస్సైకి అభినందనలు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సత్వర న్యాయం జరిగేలా చూడాలని, ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతవరణాన్ని నెలకొల్పాలని సూచించారు.

నగదు పట్టివేత

బేల: మండలంలోని శంకర్‌గూడ చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.9లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ రాధిక తెలిపారు. నాందేడ్‌కు చెందిన శంకర్ గైక్వాడ్ ఎటువంటి ఆధారాలు లేకుండా కారులో నగదు తరలిస్తుండగా పట్టుకున్నారు.

వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ-నిర్మల్

జనరల్ ఎలక్షన్స్ సంధర్బంగా వచ్చే సోమవారం నుంచి ప్రజావాణీ రద్దు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగంలో భాగంగా జిల్లా కలెక్టర్ అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణీ కార్యక్రమాన్ని వచ్చే సోమవారం నుంచి రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణీ కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

గంగనీళ్ల జాతరను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి శ్రీ మహా పోచమ్మ ఆలయ గంగనీళ్ల జాతరను ఈనెల 21, 22 తేదిల్లో నిర్వహించనున్నట్లు, దీన్ని విజయవంతం చేయాలని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, ఈఓ రంగు రవికిషాన్‌గౌడ్ అన్నారు. సోమవారం జాతర నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అనంతరం జాతర పోస్టర్లను విడుదల చేశారు. జాతరను శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. ఆలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ సరోజ, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ధర్మకర్తలు ఆలయ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



దేశానికే ఆదర్శం తెలంగాణ సంక్షేమ పథకాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేరికలు కార్యక్రమంలో యువత బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే జోగు రామన్న బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బంగారుగూడకు చెందిన బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు రామెల్లి హన్మంతుతో పాటు దాదాపు అరవై మంది యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరగా వారికి గులాబి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికే ఆదర్శవంతంగా సమర్థవంతమైన పాలన అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కె దక్కిందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు సాగుతున్న బీఆర్ఎస్‌కు మద్దతుగా పెద్ద ఎత్తున యువత పార్టీలో చేరుతున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మహిళా విభాగం అధ్యక్షురాలు స్వరూప రాణి, నాయకులు మంచాల మల్లయ్య, ఇస్రార్, పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి, త్వరితగతిన వైద్య చికిత్సలు అందించడం ద్వారా బాధితులు తొందరగా కోలుకోవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ మహిళల్లో వచ్చే క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా వైద్య సేవలను అందించవచ్చని తెలిపారు. వివిధ రకాల క్యాన్సర్లు, వాటి లక్షణాలు, వ్యాధి నిర్ధారణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన అంశాలపై మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు ఇతర వైద్య సిబ్బందికి విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్సీడీ పీఓ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

అంగరంగవైభవంగా శరన్నవరాత్రులు

నవతెలంగాణ-ఆదిలాబాద్

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఊరువాడా దుర్గాదేవి, శారదదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తి ప్రపత్తుల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక హారతులు, పూజలతో ఆరాధిస్తున్నారు. నవరాత్రులలో రెండో రోజైన సోమవారం శ్రీ గాయత్రి రూపంలో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పూజలు చేసి హారతులు అందచేశారు. కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారిని కొలిచారు. దీంతో ఆలయ ప్రాంగణంలో కోలాహల వాతావరణం నెలకొంది.

నలంద కళాశాలలో బతుకమ్మ సంబురాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నలంద కళాశాలలో సోమవారం బతుకమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా కొనసాయి. అందులో భాగంగానే పట్టణంలోని నలంద కళాశాలలో విద్యార్థునులు తీరొక్క పూలతో అందంగా పేర్చిన భారీ బతుకమ్మను మధ్యలో ఉంచి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలకు తగ్గట్టుగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ గీతాలకు అనుగుణంగా విద్యార్థినులు, అధ్యాపకురాళ్లు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేయడంతో కళాశాల ప్రాంగణంలో కోలాహల వాతావరణం నెలకొంది. అనాదిగా వస్తున్న బతుకమ్మ పండగ ప్రాశస్త్యాన్ని నేటి తరానికి తెలియజేయాలన్న ఉద్యేశంతో వేడుకలను ఘనంగా నిర్వహించినట్టు అధ్యాపకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పున్నారావ్, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

సోషల్ మీడియాపై నజర్

- కించపరిచేలా పోస్టులు పెడితే అంతే...
- జాగ్రత్తగా వాడుకోవాలని పోలీసుల సూచన



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఎన్నికల షెడ్యూల్ విడుదల అయింది. వారం రోజుల కింద ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ క్రమంలోనే ఈసీ నియమానిబంధనలు జారీ చేసింది. అభ్యర్థుల ఖర్చులతో పాటు సోషల్ మీడియాపై కూడా నజర్ పెట్టాలని ఆదేశించింది. ఆ దిశగా పోలీసులు సైబర్ సెల్‌ను యాక్టివ్ చేసి రోజువారిగా సోషల్ మీడియాలోని పోస్టులను పరిశీలిస్తున్నారు. సోషల్ మీడియాలో చిన్న వ్యాఖ్యాలు చేసిన, కించపరిచే విధంగా పోస్ట్, తీవ్రంగా వ్యతిరేకించిన పోలీసులు కేసులు పెడుతున్నారు. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉందని ఎది పడితే అది పెడితే ఎన్నికల కోడ్ ఉన్న కాలంలో జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. యువత ఉదయం నుంచి రాత్రి వరకు సోషల్ మీడియా వేదికగా రోజును గడుపుతున్నారు. ఈ క్రమంలో కొందరు వారివారి పార్టీలకు సంబంధించి ప్రచారం, ఇతర కామెంట్లు పెటుడుతుంటారు. యువరక్తం వాటిని చూసి ఎదోకటి కామెంట్ చేస్తుంది. ఈ క్రమంలో పోలీసులు వారి కామెంట్ల ఆధారంగా కేసులు నమోదు చేస్తారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను అంతగా పట్టించుకోకపోవడం మంచింది. క్షణికావేశంలో పోస్టు లేదా కామెంట్ చేస్తే మాత్రం జైలుకే వెళ్లాల్సి ఉంటుందని, యువత జాగ్రత్తగా ఉండాలి.

కఠిన చర్యలు తప్పవు

సోషల్ మీడియాలో కించపరిచే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు. ఇతరులను రెచ్చగొట్టే, ఆశాంతికి దారి తీసే వ్యక్తుల మీద కేసులు నమోదు చేస్తాం. వాట్సాప్ గ్రూప్‌లలో కామెంట్స్ వస్తే అడ్మిన్ బాధ్యత వహించాలి. కోడ్ అమలులో ఉన్నందున ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.

- ఎస్సై శ్రీకాంత్



అదనపు చెక్ పోస్టులతో నిఘా పెంచాం

- అక్రమ మద్యం, డబ్బు రవాణకు అడ్డుకట్ట వేస్తున్నాం
- జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



నవతెలంగాణ-తలమడుగు

ఎన్నికల నేపథ్యంలో జిల్లా, అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల ద్వారా నిఘాను పెంచి అక్రమ మద్యం, డబ్బు జిల్లాలోకి రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని లక్ష్మీపూర్, భీంపూర్ మండలం కరంజి చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహారాష్ట్ర రాష్ట్రంతో జిల్లాకు అనుసంధానం అయ్యే రెండు చెక్‌పోస్ట్‌లను ఎస్పీ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. మహారాష్ట్ర వైపు నుంచి మద్యం, ప్రజలను ప్రభావితం చేసే సామాగ్రి, డబ్బు, గంజాయి జిల్లాలోనికి ప్రవేశించకుండా వివిధ శాఖల సమన్వయంతో 24 గంటల అప్రమత్తతతో చెక్ పోస్టులను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏడు అంతర్‌రాష్ట్ర, 3 అంతర్ జిల్లా చెక్‌పోస్టులతో పాటు కలిపి మొత్తం 10 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. ఇక్కడ రవాణా, ఎక్సైజ్, రెవెన్యూ శాఖల సిబ్బందితో పాటు పోలీసులు విధులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తనిఖీల సందర్భంలో ప్రతి ఒక వాహనాన్ని తనిఖీ చేస్తునే వీడియో తీయడం జరుగుతుందన్నారు. ఎన్నికలు పూర్తి అయ్యే వరకు చెక్ పోస్టులను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై ధనశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సాగుచేస్తున్న వారిపై పోలీసుల ఉక్కుపాదం

నవతెలంగాణ-ఇచ్చోడ

అంతర పంటగా గంజాయి సాగుచేస్తున్న వారిపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. సోమవారం ఇచ్చోడ సర్కిల్ పరిధిలోని సిరికొండ, నేరడిగొండ మండలాల్లోని పలు గ్రామాల్లో జిల్లా ఎస్పీ ఆదేశానుసారం విశ్వసనీయ సమాచారం మేరకు ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో అంతర పంటగా సాగు చేస్తున్న గంజాయిపై పోలీసులు ఉక్కు పాదం మోపారు. సిరికొండ మండలంలోని భీంపూర్ గ్రామంలో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న కనక చిన్ను, మోరే శ్రావణ్‌లకు సంబంధించిన పంట చేను లలో అక్రమంగా సాగు చేస్తున్న 32 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.

నేరడిగొండ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో సోలంకి సూర్య సింగ్ అనే సంబంధించిన పంట చేనులో అక్రమంగా అంతర పంటగా సాగు చేస్తున్న 30 మొక్కలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరు కూడా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడవద్దని, గంజాయి సాగు, బెల్టు షాపుల నిర్వహణ, దేశీదారు అమ్మకం, మట్కా, తదితర నిషేధిత కార్యక్రమాలు నిర్వహించవద్దని హెచ్చరించారు. రెండు మండలాల్లో ఏకకాలంలో జరిగిన ఈ దాడుల్లో సిరికొండ ఎస్సై శ్రీకాంత్, నేరడిగొండ ఎస్సై సాయన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారని సంబంధిత వ్యక్తులు కనక చిన్ను, మోరే శ్రావణ్, సోలంకి సూర్య సింగ్‌లు పరారీలో ఉన్నారని సీఐ చంద్రశేఖర్ తెలిపారు.



గిరిజనేతరుల సమస్యల సాధనకు రాస్తారోకో



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

తెలంగాణ గిరిజనేతరుల సమస్యల సాధనే లక్ష్యంగా రాష్ట్ర గిరిజనేతరుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. స్థానిక మావల ప్రధాన ద్వారం వద్ద జాతీయ రహదారిపై ఆ సంఘం నాయకులు రాస్తారోకో నిర్వహించడంతో ఎక్కడికక్కడ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని నాయకులు పెద్ద ఎత్తున నినాదాలతో చేశారు. అనంతరం అక్కడికి పోలీసులు చేరుకొని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా గిరిజనేతరుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భరత్ వాఘ్మరే మాట్లాడుతూ ఏజెన్సీ రైతులకు పహానిలు ఇచ్చి రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ గిరిజనేతరులకు గృహలక్ష్మి కింద ఇండ్లు మంజూరు చేయాలని తెలిపారు. సమస్యలను పరిష్కరించేంత వరకు సంఘం తరపున పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనేతరుల సంఘం అధికార ప్రతినిధి దుర్గం శేఖర్, రాష్ట్ర నాయకులు మల్లెపూల నర్సయ్య, బుట్టో ఖాన్, కుంట విద్యాసాగర్ రెడ్డి, జాడి రాజారెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగోరావ్ జాదే, నర్సింగ్ మొరే, జిల్లా నాయకులు ఎండీ మసూద్, సంజీవ్, దావుల రమేష్, కేంద్రే మాధవ్, షేక్ అలీ పాల్గొన్నారు.

అనిల్ జాదవ్‌కు సన్మానం

నవతెలంగాణ-ఇచ్చోడ

బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌ను సోమవారం ఆయన నివాసంలో ఇచ్చోడ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ పార్టీ బిఫామ్ అందుకుని వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఇచ్చోడ ఉపసర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి, నాయకులు మామిడి విజయ్, భూషణ్, గట్టు మహేందర్, అభిలాష్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఈ సారి జరుగబోయె ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తోందని సోమవారం ఆ పార్టీ మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని తప్పకుండా గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో సోమవారం బూత్ స్థాయి కమిటీలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించే ధమ్ములేని పార్టీలు ఎలా గెలుస్తాయని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభంజనం సృష్టిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్, సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, చామాన్‌పల్లి సర్పంచ్ పడిగెల గంగాధర్, నాయకులు బూసి ముత్యం, శాతం గంగారాం, చిన్నారెడ్డి, సురేష్, నరేష్, రవీందర్, సాయన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం .. ఆదరించాలి



నవతెలంగాణ-ముథోల్

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక అభివద్ధి పథకాలు ప్రజలకు అందాయని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అఫ్రోజ్ ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానిక మల్లన్న ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్య వైద్యం, ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు లావణ్య రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాలిద్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధి రవీందర్‌రెడ్డి విద్యార్థులకు మూఢ నమ్మకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. సైన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్, ఎన్‌సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ రూపేందర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పనులకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయదశమి వేడుకలకు పెద్ద ఎత్తున హాజరు కావాలని శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠాధిపతి శ్రీ యోగనంద సరస్వతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాం లీలా మైదానంలో వేడుకలకు సంబంధించిన పనులను సమితి ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. పనులకు భూమిపూజ చేసిన అనంతరం ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీ యోగానంద సరస్వతి మాట్లాడుతూ గత పదకొండు సంవత్సరాలుగా సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విజయదశమి పర్వదిన వేడుకలను రాంలీలా మైదానంలో ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ యేడు సైతం రావణ దహనంతో పాటు పండగ ఉత్సవాలను జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హిందూ బంధువులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావలని అన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, గౌరవ అధ్యక్షులు ప్రఫుల్ వర్ఖే, గేడం మాధవ్, సూర్యకాంత్, శశికళ చౌహాన్, రవీందర్, విజయ్, సంజీవ్ పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఖుర్షీద్‌నగర్, డాల్డా కంపెనీ, వద్ద మట్కా నిర్వహిస్తున్న స్థావరాలపై సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మట్కా నిర్వహిస్తున్న షేక్ సొహిల్ అనే వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుంచి రూ.6వేల 30 మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అనంతరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.



కుమ్మరి సంఘం మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



కుమ్మరి కుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధరి తిరుపతి, ప్రధాన కార్యదర్శి నాగపురి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం జన్నారం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎగుడు భూమన్న, గౌరవ అధ్యక్షుడిగా కొత్తపల్లి రామన్న, ప్రధాన కార్యదర్శిగా కట్లకుంట రాజన్న, కోశాధికారిగా ఉప్పులేటి అంజన్న, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా నూతన అధ్యక్షుడు ఎగుడు భూమన్న మాట్లాడుతూ కుమ్మరులకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లపల్లి సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు పైడిపాల రమేష్ ప్రచార కార్యదర్శి తిరుపతి, మండల నాయకులు, మురళీ, రాజన్న, సత్యం పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పోలీసుల తనిఖీలలో సోమవారం దేశీదారు మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. టౌన్ సీఐ బుద్దె స్వామి ఆధ్వర్యంలో ఎస్సైలు కళ్యాణ్, శ్రీకాంత్, సిబ్బంది పట్టణంలో తనిఖీలు చేపడుతున్నారు. ఈ క్రమంలో మహారాష్ట్ర బల్లార్షాకు చెందిన గణేష్ నర్సింగ్ బోగవార్ వద్ద 250 దేశీదారు మద్యం బాటిళ్లు స్వాధీనమయ్యాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశీదారు రవాణా చేసినా, గుడుంబా అమ్మినా, పేకాట ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బురుగూడ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బురుగూడకు చెందిన లోనరే సురేష్(30) మద్యానికి బానిసయ్యాడు. రోజు మద్యం తాగి ఇంట్లో డబ్బుల కోసం గొడవ పడుతుండేవాడు. శుక్రవారం రోజులాగే మద్యం తాగి అదే మత్తులో రాత్రి ఇంట్లో ఉన్న పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ నాయకుడు



నవతెలంగాణ-జన్నారం

తెలుగుదేశం పార్టీ అదిలాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపెల్లి రాజేశ్వర్ పార్టీకి రాజీనామా చేసి హైదరాబాద్ ప్రగతి భవన్‌లో ఖానాపూర్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి ఎమ్మెల్సీ దండే విఠల్ , ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కండువా కప్పి పార్టలోకి ఆహ్వానించారు. గత ముప్పై సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీల పాత్ర పోషిస్తూ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఇటీవల ధర్మపురి రిజర్వుడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ అధిష్టానం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో పార్టీకి ఎంత సేవచేసినా గుర్తింపు ఇవ్వకపోవడంతో కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోను చూసి బీఆర్ఎస్‌లో చేరారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో జాన్సన్ నాయక్ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానన్నరు. రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ గెలవబోతుందని కేసీఆర్ ముఖ్య మంత్రి కావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ముగిసిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు



నవతెలంగాణ-తాండూర్

ఈ నెల 13 నుండి 16 వరకు, బెల్లంపల్లి సీఓఈలో నాలుగు రోజులపాటు నిర్వహించిన 9వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. వ్యక్తిగత అథ్లెటిక్స్ పోటీల్లో జాతీయ రికార్డులను సైతం నెలకొల్పారు. కాలేశ్వరం జోన్‌లోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల,పెద్దపల్లి, ములుగు జిల్లాలకు చెందిన 11 సాంఘిక సంక్షేమ బాలుర గురుకులాలకు చెందిన సుమారు 12 వందల మంది విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ముగింపు కార్యాక్రమానికి బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలు మనిషిలోని దాగివున్న శక్తిని నైపుణ్యాన్ని వెలికితీస్తాయన్నారు. విద్యార్థులు క్రీడల్లో తమ నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునే విధంగా కృషి చేయాలన్నారు. నాలుగు రోజులుగా విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించి నిర్వహణ కార్యక్రమాలు చేపట్టిన ప్రిన్సిపల్ ఐనాల సైదులు సిబ్బందినిప్రశంసించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రధానం చేశారు.

పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన యువకునికి సన్మానం



నవతెలంగాణ-కెరమెరి

ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపికైన యువకునికి స్థానిక యువకులు ఘనంగా సన్మానించారు. మండలంలోని ఝరి గ్రామానికి చెందిన నైతం అనిల్ కుమార్ నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజన యువకుడు ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మక్కువతో డీఈడీ పూర్తి చేసి, రెండేళ్ల విద్యావలంటీర్‌గా ఓ ప్రభుత్వ పాఠశాలలో పని చేశారు. లాక్ డౌన్ కాలంలో ప్రభుత్వం తొలగించడంతో ఇతర పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా నిలిచాడు. గత కొన్ని నెలల క్రితం ప్రభుత్వం కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్ జారీ చేయడంతో పట్టుదలతో చదివి కానిస్టేబుల్ పరీక్షలో ప్రతిభ చాటాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్ గా ఎంపికయ్యాడు. దీంతో స్థానిక యువకులు, అతని స్నేహితులు శాలువతో సన్మానించారు. సన్మానించిన వారిలో కోవ విజయ్ కుమార్, మందడే ప్రశాంత్, అడ చిన్ను, సెండే ప్రకాష్, అదే మున్నాజి, అదే విజయ్, శ్రీకాంత్, మెస్రం దినేష్ కుమార్, అడ సొంజి, రవి పాల్గొన్నారు.

ఎన్నికల విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలి

- అదనపు కలెక్టర్ దాసరి వేణు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణలో కేటాయించిన విధులను అధికారులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని ఆసిఫాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. సోమవారం ఆర్డీఓ సురేష్‌తో కలిసి రెవెన్యూ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 597 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, సి-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు వినియోగించుకునే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని, గర్భిణులు, దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపు సౌకర్యం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఓటు హక్కును ఇంటి వద్ద నుండే వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని, కంప్యూటర్ ఆపరేటర్లు కీలకమని అన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని కంప్యూటర్‌లో నమోదు చేయాలని, వాహనాల అనుమతి వివరాలు, అభ్యర్థుల అఫిడవిట్ వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేసే సమయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. బాధ్యతలు కేటాయించిన అధికారి, సిబ్బంది అధికారుల ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉద్యోగులు సమన్వయంతో అంకితభావంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్లు, నోడల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నగదు, అక్రమ మద్యం రవాణపై ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నగదు, మద్యం సరఫరాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నట్టు ఎస్పీ కె.సురేష్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవేపై నిర్వహిస్తున్న వాహనాల తనిఖీని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తామని, నగదు, మద్యంపై ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంటుందని, మోడల్ కోడ్ అమలులోకి వచ్చినందున ప్రజలు రూ.50 వేల నగదు కంటే ఎక్కువ, పెద్ద మొత్తంలో బంగారం, ఇతర వస్తువులను తీసుకెళ్లేవారు ఆధారాలను చూపాలని తెలిపారు. లేని పక్షంలో నగదు, ఇతర వస్తువులు, బంగారం ఆభరణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటి వరకు 254.58 లీటర్ల మద్యాన్ని స్వాధీనపరుచుకున్నమని, వాటి విలువ రూ.83,670 ఉంటుందన్నారు. రూ.35,27,400ల నగదు, 182 మొబైల్ ఫోన్లు సీజ్ చేశామన్నారు. రౌడీ షీట్, సస్పెక్ట్ షీట్ చెడు నడత గల వారిని 209 మందిని ఇప్పటికే బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

సిర్పూర్(టి) : ఎన్నిక కమీషన్ ఆదేశాల మేరకు అధిక మొత్తంలో ఆధారాలు లేని నగదును తరలిస్తే వాటిని సీజ్ చేస్తామని ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. సోమవారం మండలంలోని పెద్దబండ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేశారు. కౌటాల మండలానికి చెందిన కుంచాల శివకుమార్ అనే వ్యక్తి కాగజ్‌నగర్ నుంచి కౌటాలకు రూ.1.40 లక్షలు, అలాగే సిర్పూర్‌కు చెందిన మచ్చ రామన్న రెబ్బెన నుంచి కౌటాలకు రూ.లక్ష నగదును వెంటతెచుకున్న ఆధారాలు లేని నగదును పట్టుకున్నట్టు తెలిపారు. ఎన్నికల నియమావళి ప్రకారం ప్రజలు సహకరించాలని, ఎలాంటి ఆధారాలు లేకుండా నగదును, బంగారం, అక్రమ మద్యం తరలించొద్దని సూచించారు.



కోనప్పను గద్దె దించితే ఎస్పీఎం వైఖరిలో మార్పు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు ఎమ్మెల్యే కోనేరు కోనప్పను గద్దె దించితేనే సిర్పూరు పేపర్ మిల్లు యాజమాన్య వైఖరిలో మార్పు వస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాజమాన్యం కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని, దీనికి ఎమ్మెల్యే అండదండలే కారణమని అన్నారు. ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేస్తే అందులో నుంచి కేవలం రూ.3 కోట్లను కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చి మిగిలిన రూ.7 కోట్లను రాబోయే ఎన్నికలలో కోనప్ప గెలుపు కోసం ఖర్చు చేసేందుకు మిగుల్చుకుందని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో ఒక్కో కాంట్రాక్టు కార్మికునికి రూ.40 వేలు ఇస్తానని చెప్పిన కోనప్ప, ఇపుడు కేవలం రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.40 వేలతో పాటు ఈ ఐదేళ్ల వడ్డీ కూడా కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులను చైతన్యపరిచి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, రాపర్తి ధనుంజయ్, ఎల్ముల మల్లయ్య, సిహెచ్ సత్యనారాయణ, తాళ్ల రామయ్య, దామోదర్ పాల్గొన్నారు.



ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన నాయకులతో పాల్వాయి హరీష్‌బాబు

ఇతర పార్టీల నుండి చేరికలు

దహెగాం, చింతలమానెపల్లి మండలాల నుండి సోమవారం పలు పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలో చేరారు. దహెగాం మండలం మొట్లగూడ, రావులపల్లి, చింతలమానెపల్లి మండలం బాబాసాగర్ గ్రామాలకు చెందిన వారు బీజేపీలో చేరగా వారికి హరీష్‌బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎంజేపీ హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహాత్మ జ్యోతిబాపూలే(ఎంజేపీ) హాస్టల్‌లో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జ్యోతి బాపులే హాస్టల్ వర్కర్స్ చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మిగతా ఆశ్రమ, ఆదర్శ పాఠశాల హాస్టల్, కస్తూరిబా హాస్టల్‌లలో పనిచేస్తున్న కార్మికులకు జీఓలను అమలు చేస్తూ, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పిస్తున్నారని, జ్యోతిబాపూలే హాస్టల్లో మాత్రం కాంట్రాక్టు పద్ధతిలో కాకుండా టెండర్ ప్రక్రియ ద్వారా కార్మికులను నియమించి ఎలాంటి జీఓలను అమలు చేయడం లేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించకుండా శ్రమదోపిడికి గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జీఓ నెంబర్ 14 లేదా 60ను అమలు చేస్తూ, కార్మికులకు ఉద్యోగ భద్రత, వేతనాలను నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతిబాపూలే హాస్టల్ వర్కర్స్ సత్యమ్మ మమత, అనిత, నాగవల్లి, పుష్పలత పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-తాండూర్

ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ తాండూర్ శాఖ మేనేజర్ ప్రభుదాస్ సూచించారు. సోమవారం రిజర్వు బ్యాంకు ఆదేశాల మేరకు ఖాతాదారులకు జాతీయ సమగ్ర అవగాహన కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్గత ఫిర్యాదుల పరిష్కార విధానం, సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీ రాయితీ కల్పిస్తుందని తెలిపారు. తమ బ్యాంకు పరిధిలో వినియోగదారులకు అన్ని రకాల బీమా సౌకర్యాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, వ్యవసాయ రుణాలు పొదుపు సంఘాల రుణాలు వంటి అన్ని సేవలను రిజర్వు బ్యాంకు నిబంధనల మేరకు అందిస్తున్నట్టు తెలిపారు. ఖాతాదారులు పొదుపు మార్గంలో పయనిస్తూ ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని వంజీరి ప్రధాన రహదారి సమీపంలో సోమవారం సాయంత్రం ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన వడాయి శారద, పుల్లయ్య దంపతుల కుమారుడు శ్రీకాంత్ తన స్నేహితుడు ఎల్.ప్రవీణ్‌తో కలిసి సోమవారం ద్విచక్రవాహనంపై దుర్గామాత అలంకరణ సామాగ్రీ కొనుగోలు చేసేందుకు ఆసిఫాబాద్‌కు వెళ్లారు. సామాగ్రి కొనుగోలు చేసిన అనంతరం ఇద్దరు స్నేహితులు ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. వంజీరి సమీపం రాగానే ప్రవీణ్ తాను మలవిసర్జనకు వెళ్తాననడంతో ద్విచక్రవాహనాన్ని ఆపాడు. ప్రవీణ్ మలవిసర్జనకు బైక్ దిగగా వెనుక నుంచి ఇసుక లోడ్‌తో అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వడాయి శ్రీకాంత్(23) అక్కడిక్కడే మృతిచెందగా, ఎల్.ప్రవీణ్ సురక్షితంగా బయట పడ్డాడు. శ్రీకాంత్ తన సొంత గ్రామమైన రాస్పెల్లిలో చికెన్ సెంటర్ నిర్వహణతో పాటు వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరా నిలుస్తున్నాడు. ఎదిగిన కుమారుడు ఆకాల మరణంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. సంఘటనకు కారకుడైన మండలంలోని నామనగర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అదే బాపురావుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సోనియా తెలిపారు.

జర్నలిస్టులకు బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-దండేపల్లి

జర్నలిస్టులకు చెన్నూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలని దండేపల్లి జర్నలిస్టులు డిమాండ్ చేశారు. సోమవారం దండేపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లక్షెట్టిపేట్, నర్మల్ రహదారిపై నల్ల బాడ్జీలు ధరించి రాస్తారోకో నిర్వహించారు. జర్నలిస్టులకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బండి రవి గౌడ్ మాట్లాడుతూ బాల్క సుమన్ జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. కార్యకర్తల సమావేశంలో వంకర టింకర వార్తలు రాసే వాడొకడు వీడు ఒకడు అంటూ జర్నలిస్టులను సక్కగా చేయాలని కార్యకర్తల సమావేశంలో దూశించడం దేనికి సంకేతం అన్నారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి మండల ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా పాత్రికేయులు వెంకటేష్, వెంకటపతి, బుర్ర శ్రీనివాస్ గౌడ్, అల్లంల కుమార స్వామి, ఎంగుందుల సత్యం, కుంచె ప్రసాద్, ఎడ్ల రాజన్న, సత్యం, సుభాష్ పాల్గొన్నారు

ఉద్యోగొన్నతి పొందిన అధికారికి సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయంలో సోమవారం డీవైపీఎం నుంచి పర్సనల్ మేనేజర్‌గా ఉద్యోగొన్నతి పొందిన రెడ్డిమల్ల తిరుపతిని పర్సనల్ డిపార్టుమెంటు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్ఓడీ(హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్)గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఉత్సాహంగా పనిచేసి పెండింగ్ పనిలేని డిపార్టుమెంటుగా నిలపాలని ఆయన ఉద్యోగులను కోరారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారులు మండల శ్రీనివాస్, ప్రశాంత్, సీనియర్ అసిస్టెంట్ బాబా, రమ్య పాల్గొన్నారు.

ఖైరిగూడ ఓసీని పరిశీలించిన డీడీఎంఎస్

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీని సోమవారం డీడీఎంఎస్(మైనింగ్) ప్రేమ్‌కుమార్ సందర్శించారు. క్వారీ లోపల గల సౌకర్యాలను ఆయన పరిశీలించారు. వాహనాల రాకపోకల తీరుపై ఆరా తీశారు. లైట్ మోటార్ వాహనాల కోసం వేసిన రోడ్లను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జీఎం మచ్చగిరి నరేందర్, పీఓ సత్యనారాయణ, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న, ఇన్‌ఛార్జి మేనేజర్ మధూసూధన్, సేఫ్టీ ఆఫీసర్ రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

చైతన్య కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని చైతన్య జూనియర్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు విద్యార్థినీలు ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ సాయిని రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ విద్యార్థులతో కలిసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవ ప్రతికైన బతుకమ్మను సంతోషాల మధ్య ప్రతి ఒక్కరు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థినీలు తీరక్క పూలతో బతుకమ్మలు పేర్చి అలంకరించారు. కళాశాల ముందు నిర్వహించిన బతుకమ్మ వేడుకలు పండుగ వాతావరాన్ని తలపించింది.

బంబారాలో వైద్యశిబిరం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా, గొల్లగూడ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించినట్టు ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వైద్య పరీక్షలతో పాటు రక్తనమూనాలు సేకరించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, ఏఎన్ఎం సునంద, ఆశావర్కర్లు లక్ష్మి, సువర్ణ పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా తక్షణమే చెల్లించాలి

నవతెలంగాణ-గోదావరిఖని

సింగరేణి కార్మికులకు తక్షణమే ముందుగా ప్రకటించిన విధంగా 32 శాతం లాభాల్లో వాటా చెల్లించాలని, లాభాల్లో వాటా చెల్లింపు ప్రక్రియ ఎలక్షన్ కోడ్‌కు సంబంధం లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కె.స్వామి, ఆర్జీ-1 బ్రాంచ్ కార్యదర్శి ఆరెల్లి పోషంలు అన్నారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని గనులు, డిపార్ట్మెంట్లు, ఓసీపీలలో జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు హక్కుగా రావాల్సిన సొమ్మును నిలిపివేయడం సమంజసం కాదని యాజమాన్యంపై మండిపడ్డారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రంగు శ్రీనివాస్, మాదన మహేష్, సంకె అశోక్, ఎస్. వెంకట్ రెడ్డి, మిట్ట శంకర్, బోగ సతీష్ బాబు, ఎం.చక్రపాణి, చెప్యాల భాస్కర్, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, కారంపూడి వెంకన్న, ఎం.సంపత్, శ్రీనివాస్ తదితరు లున్నారు.



వినతి అందజేస్తున్న నాయకులు

బాలిక గర్భవతి..?

నవతెలంగాణ - హాజీపూర్

మండలంలోని గుడిపేట్ గ్రామానికి చెందిన బాలిక గర్భవతి అయిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇంటర్ చదివే బాలికను స్థానిక యువకుడు లోబార్చుకొని గర్భవతిని చేసినట్లు గ్రామంలో చర్చ జరుగుతుంది. కాగా ఆ యువకునిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలు దొంగతనం కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఆ బాలిక ఇప్పుడు 8 నెలల గర్భవతి కావడం గమనార్హం. ఈ విషయమై స్థానిక గ్రామ పెద్దమనుషులు పంచాయతీ చేసి మరీ సహజీవనం చేయమని చెప్పడం కొసమెరుపు.బాలిక గర్భం దాల్చిన విషయం స్థానికులకు తెలిసిన కానీ ఏ ఎన్ ఎం ,అంగన్వాడీ,సంబంధిత శాఖ అధికారులకు తెలియదా.? తెలిసిన కానీ విషయం బయటకు రాకుండా వుంచారా అనేది ప్రశ్నగా మిగిలింది.కాగా ఇప్పుడు ఆ బాలిక ఆ యువకుని తోనే వుంటునట్లు సమాచారం.

26, 49వ డివిజన్‌లో టీఎల్‌పీ ప్రచారం

నవతెలంగాణ-గోదావరిఖని:

తెలంగాణ లేబర్ పార్టీ రామగుండం నియోజకవర్గం అభ్యర్థి గొర్రె రమేష్ సోమవారం 26, 49 డివిజన్‌లలో ప్రచారం నిర్వహించారు. డివిజన్లలోని ఇంటింటికి తిరుగుతూ తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఒక్కసారి అవకాశం ఇస్తే రామ గుండంకు అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని అన్నారు. ఆయన వెంట అల్లెపు తిరు పతి, కన్నం భానుచందర్, చెరుకు పైడి, జక్కంకవిత, పొన్నం రజిత, తదితరులున్నారు.

పేదింటి మహిళకు పుస్తెల వితరణ

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం మైదబండ పంచాయతీ పరిధిలోని సర్వారం గ్రామంలో నివాసముండే నిరుపేద కుటుంబానికి చెందిన సజ్జనపు మమత అనే మహిళలకు గ్రామస్తులు పుస్తెలు అందజేశారు. గ్రామస్తులు విరాళంగా సేకరించిన 48వేల రూపాయలతో ఈ పుస్తెలు చేయించి సజ్జనపు మమత శ్రీనివాస్ దంపతులకు సోమవారం అందించారు. గత నెల 28వ తేదీన బేగంపేటకు చెందిన బొంతల రాజ్‌కుమార్ అనే దొంగ మమత మెడలో నుంచి పుస్తెల తాడు ఎత్తుకెళ్లిన, ఈక్రమంలో చెరువులో పడి చనిపోగా, ఆమె పుస్తెల తాడు కూడా దొరకలేదు. దీంతో ఆ నిరుపేద కుటుంబానికి గ్రామస్తులు ఉదాతరణను చాటుకున్నారు.



గ్రామస్తులు అందించిన పుస్తెలు

నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ- పెద్దపల్లి

తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం పెద్దపల్లి ఐటీఐ కాలేజీలో కాలేజీ గ్రౌండ్‌లో ఆశా వర్కర్ల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఆశా వర్కర్ల డిమాండ్లను ప్రతి పార్టీ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షురాలుగా జి జ్యోతి, జిల్లా అధ్యక్షురాలుగా శారద, ప్రధాన కార్యదర్శిగా డి రజిత, కోశాధికారిగా వి. అమృత ఉపాధ్యక్షురాలుగా శివ లీల సహాయ కార్యదర్శిగా జి.లక్ష్మీలను ఎన్నుకున్నారు.



ఆశా వర్కర్స్ జనరల్ బాడీ సమావేశం

వాహనదారుడికి జైలు శిక్ష

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:

ఇటీవల రామగుండం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన గాజుల అశోక్‌కు కోర్టు జైలుశిక్ష విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ టి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన అశోక్‌ను సోమవారం గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ఎదుట హాజరు పరచగా, మూడు రోజుల జైలు శిక్ష విధించారని సీఐ తెలిపారు.

ప్రెస్ క్లబ్ బాయ్ దస్తగిరికి రూ.5వేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:

గోదావరిఖని ప్రెస్ క్లబ్ బాయ్‌గా పనిచేస్తూ డయాలసిస్ సమస్యతో భాదపడుతున్న దస్తగిరికి సోమవారం సీతారామ సేవా సమితి సభ్యులు మానవతా దక్పథంతో 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సీతారామ సేవా సమితి సభ్యురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ సీతారామ సేవా సమితిలో ఉంటున్న సభ్యులందరూ ప్రతినెల 100 రూపాయలు జమజేస్తూ ఆపదలో ఉన్నవారికి, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవారికి అందిస్తూ సేవా మార్గంలో నడుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ సీతారామ సేవా సమితి సభ్యులు గోలివాడ చంద్రకళతోపాటు కంది సుజాత, సరితలక్ష్మీ, మేడగోని స్వప్న, సమ్మెట స్వప్న, పిట్టల చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న సభ్యులు

21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరీ

నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం కమీషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాల స్మరణలో భాగంగా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీస్ ఫ్లాగ్‌డే సందర్భంగా సంస్మరణ కార్యక్రమాలను అక్టోబర్ 21 నుంచి31 వరకు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసు విధులు, త్యాగాలు, సాంకేతిక ప్రజల రక్షణలో పోలీసుల సేవలు మొదలగునవి విషయాలను ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో వెబ్ సైట్‌ద్వారా వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుందని, తెలిపారు.షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు కూడా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.



రెమా రాజేశ్వరీ

రూ.3లక్షల నగదు పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల సందర్భంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును సీజ్ చేస్తున్నారు. ఎస్సై సంతోష్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3 లక్షల 10వేలను స్వాధీనం చేసుకున్నారు. పోతారాజుల మల్లేష్ వద్ద రూ.2 లక్షల10 వేలు, పసునూరి శంకర్ వద్ద 1లక్ష నగదు స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ టీంకి అందజేసినట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జన్నారం : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని మందపల్లి స్టేజి వద్ద సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో జగిత్యాల జిల్లాకు చెందిన ఆది అంజయ్య వద్ద రూ.లక్ష 50వేలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని ఫ్లయింగ్ స్క్వాడకు అప్పజేశారు. ఈ తనిఖీలో ఎస్సై పి సతీష్ ఈఓపీఆర్డీ రమేష్ ఉన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలోని సరిహద్దులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తుల వద్ద నుంచి డబ్బులను పట్టుకున్నట్టు ఎస్సై సాగర్ తెలిపారు. ఒకరి వద్ద రూ.2.40 లక్షలు, రూ.75,500, రూ.68 వేలు, రూ.60 వేలు నగదు లుగురి వద్ద నుంచి డబ్బులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటికి ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసి వారిపై కేసునమోదు చేసినట్టు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరు కూడా రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లినట్టయితే వాటికి సంబంధించిన ఆధారాలు ఉండాలని, లేకపోతే డబ్బులను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.



మంచిర్యాల



జన్నారం

లాభాల వాటా పంపిణీ చేయాలని వినతి

నవతెలంగాణ-గోదావరిఖని:

ఎన్నికల కోడ్ పేరుతో ఆపివేసిన సింగరేణి లాభాల వాటా పంపిణీని వెంటనే చేపట్టాలని ఎన్నికల సంఘం అధికారికి ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ నెల 16న ఎన్నికల కోడ్ పేరుతో ఆపివేసిన 32 శాతం సింగరేణి లాభాల వాటా పంపిణీ వెంటనే చేపట్టాలని కోరారు. ఎన్నికల కోడ్ ప్రకటన కంటే ముందే లాభాల వాటా ప్రకటన జరిగిపోయిందని, అయినప్పటికీ ఎన్నికల కోడ్ పేరుతో 16న చెల్లించాల్సిన వాటా చెల్లింపును నిలిపివేయడం సరికాదని అన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న జనక్ ప్రసాద్

రాహుల్ గాంధీ పర్యటన రూట్ మ్యాప్ పరిశీలన

నవతెలంగాణ-గోదావరిఖని:

ఈ నెల 19న పెద్దపల్లి జిల్లాలో రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో సోమవారం ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి రూట్ మ్యాప్‌ను పరిశీ లించారు. ఈ సందర్భంగా రోహిత్ చౌదరిని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, చింతకుంట విజయరమణరావులు పూలమాలతో సన్మానించారు.



రోహిత్ చౌదరిని సన్మానిస్తున్న నాయకులు

బీఫామ్ అందుకున్న కోరుకంటి

నవతెలంగాణ-గోదావరిఖని:

బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ చేతుల మీదుగా సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ బీఆర్ఎస్ పార్టీ బీఫాంను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చందర్ సీఎం కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్నారు.



బీఫాం అందుకుంటున్న ఎమ్మెల్యే కోరుకంటి

గుణసుందరి కథ సినిమాను ఆదరించండి



మాట్లాడుతున్న కన్నూరి సతీష్ కుమార్

నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం ప్రాంత యాసలో, తెలంగాణ భాషలో మన గోదావరి ఖని బిడ్డ ఓంప్రకాష్ మార్త దర్శకత్వంలో నిర్మించబడిన గుణ సుందరి కథ చిత్రంను రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రేక్షకులు ఆదరించాలని రామగుండం మున్సిపల్ కార్పొరేటర్స్ ఫోరం అధ్యక్షుడు కన్నూరి సతీష్ కుమార్ అన్నారు. స్థానిక శ్రీనివాస థియేటర్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులతో, స్థానిక మిత్రులతో కలిసి గుణ సుందరి కథ సినిమాను తిలకించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఓం ప్రకాశ్‌ను, ఇందులో నటించిన నటీనటులనుఅభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేటర్స్ ఫోరం నాయకులు నీల పద్మ గణేశ్, కాల్వ శ్రీనివాస్, స్థానిక సీనియర్ నాయకులు కోట రవిగౌడ్, చల్లా రవీందర్ రెడ్డి, మండలి సత్యనారాయణలు పాల్గొన్నారు.

46వ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జీగా ఎల్లయ్య యాదవ్

నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీగా పాతపెల్లి ఎల్లయ్య యాదవ్‌ను సోమవారం రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ నియ మించారు. రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు.



పాతపల్లి ఎల్లయ్య

సింగరేణి కార్మికులకు లాభాల బోనస్ చెల్లించాలి

- పీఎస్‌సీడబ్ల్యూయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల రమేష్

నవతెలంగాణ-గోదావరిఖని:

సింగరేణి కార్మికులకు లాభాల బోనస్ చెల్లిం చాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (పీఎస్‌సీడబ్ల్యూయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల రమేష్ డిమాండ్ చేశారు. 2022-23 సంవత్సరానికి సింగరేణి కార్మికుల లాభాల నుండి 32 శాతం బోనస్ ఈ నెల 16న చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించిందని, ఈనెల 4న యాజమాన్యం చేసిన ఈ ప్రకటనకు ఎన్నికల కమిషన్ 9న విడుదల చేసిన ఎన్నికల కోడ్‌కు ఏమాత్రం సంబంధం లేదని కార్మికుల వేతనాలు, ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకోవడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు.

రెడీమెడ్ షోరూంను ప్రారంభించిన కార్పొరేటర్లు

నవతెలంగాణ-గోదావరిఖని:

గోదావరిఖని కల్యాణ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన డెనిమ్ మాల్ రెడీమెడ్ షోరూం ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 42వ డివిజన్ కార్పొరేటర్ బాలరాజ్ కుమార్, 48వ డివిజన్ కార్పొరేటర్ పొన్నం విద్య లక్ష్మణ్ గౌడ్ హాజరై షోరూంను ప్రారంభించారు.



షోరూంలో కార్పొరేటర్లు

కార్మికుల లాభాల వాటా చెల్లించాలి

- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

నవతెలంగాణ-గోదావరిఖని:

సర్క్యులర్ ప్రకారం కార్మికుల లాభాల వాటా 32శాతం వెంటనే చెల్లించాలని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని అన్ని మైన్స్, డిపార్ట్‌మెంట్‌లలో సోమవారం ప్లేకార్డులు ప్రదర్శించి, నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జీడీకే-2, 2ఎ గని వద్ద యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ఏరియా వర్క్ షాప్‌లో మెండె శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. లాభాల వాటా చెల్లించేందుకు ఎన్నికల కోడ్ ముడిపెట్టి వాయిదా వేయడం సరికాదని అన్నారు. సర్క్యులర్ ప్రకారం కార్మికుల అకౌంట్లో లాభాల వాటాను డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి రాజమౌళి, ఎస్కే గౌస్, సిహెచ్.వేణుగోపాలరెడ్డి, జెల్ల గజేంద్ర, మానాల రాజేశ్వరరావు, పి.శ్రీనివాస్‌రావు, వంగల రాములు,భీమానాయక్, సీహెచ్.లక్ష్మణ్, జనార్ధన్, తనుగుల సతీష్, దాసరి సురేష్‌లు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-గోదావరిఖని:

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజామోద యోగ్యమైన ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకటించడంతోపాటు మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తూ రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మూల విజయా రెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గాదం విజయ, కల్వచర్ల కృష్ణవేణి భూమయ్య, జనగామ కవిత సరోజిని, నాయకురాలు రమ్య యాదవ్, ముద్దసాని సంధ్యారెడ్డిలు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న నాయకురాల్లు

కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇవ్వండి

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు కోరారు.రామగుండం నియోజక వర్గంలో ని 17వ డివిజన్‌లో సోమవారం ఇంటిం టికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రామగుండంలో రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్‌కి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరి తిరుపతి, మహేష్,మోతుకు అవినాష్,మహిళ అధ్యక్షురాలు బండారి సునీత,శంకర్,కిరణ్,సంతోష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండల కేంద్రానికి చెందిన నేరువట్ల ప్రణయ్ అనారోగ్యానికి గురై మృతి చెందగా జూలపల్లి ఆటో యూనియన్ సభ్యులు మృతుని కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ఓల్లాజీ మహేందర్,ఎండి అసాద్, పూదరి వెంకటరమణ,నేరువట్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

జాడి శ్రీనివాస్‌కు సాహిత్యరత్న జాతీయ అవార్డు

నవతెలంగాణ-ధర్మారం

ధర్మారం మండలంలోని గోపాల్ రావుపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, కవి గాయకులు,భారత్ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జాడి శ్రీనివాస్ నిన్న ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియంలో సాహిత్య రత్న జాతీయ అవార్డును పొందారు.తెలంగాణ జానపద పాటలను రాస్తూ తనదైన బాణీలో పాడుతూ ప్రజలను సామాజికంగా చైతన్య పరుస్తున్నందుకుగాను జాడి శ్రీనివాస్ ఈజాతీయ అవార్డు దక్కింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాన్షిరాం సోదరి కౌర్ గారు,ఢిల్లీ రాష్ట్ర కార్మిక, పట్టణ, గృహ నిర్మాణ,క్రీడలు,సాంఘిక సంక్షేమ మంత్రివర్యులు రాజ్ కుమార్ ఆనంద్, ఢిల్లీ స్థానిక ఎమ్మెల్యే విశేష్ రవి సాహితీ రత్న అవార్డును జాడి శ్రీనివాస్ దంపతులకు అందజేశారు. జానపద రంగంలో తను చేస్తున్న కృషికి జాతీయ స్థాయి అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందని తన బాధ్యత మరింత పెరిగిందని బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణకు బీఎస్‌ఏ కమిటీ సభ్యులకు జాడి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

కార్మికుల వాటాను అడ్డుకోవడం సరికాదు : ఐలి శ్రీనివాస్

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ

ఎన్నికల కోడ్ పేరుతో కార్మికుల వాటాను అడ్డుకోవడం సరికాదని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ అన్నారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి దేశానికి వెలుగులు నింపుతున్నారని, అలాంటి కార్మికుల కష్టాలు గుర్తించి సింగరేణి ప్రతి ఏడాది కంపెనీ లాభాలలో కొంత శాతం కార్మికులకు అందజేయడం జరుగుతుందని, ఈ ఏడాది ఎన్నికల కోడ్ పేరుతో దసరా ముందు వచ్చే వాటాను అడ్డుకోవడం సరికాదని అన్నారు.ఈ మేరకు ఆర్జీ-2 ఏరియాలో అన్ని గనుల డిపార్ట్‌మెంట్‌లలో అధికారులకు మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు, జీఎం కంపెనీ నాయకులు రెసిడెన్షియల్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఐలి శ్రీనివాస్

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే : మంథని ఎమ్మెల్యే

నవతెలంగాణ-ముత్తారం:

పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ముత్తారం మండలం లోకి పలు గ్రామాలకు చెందిన 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, ఇక రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, ముత్తారం మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, తదితరులున్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

జన్మదిన వేడుకలకు హాజరైన పుట్ట శైలజ

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం కేంద్రంలో బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు చల్ల సమ్మయ్య మొదటి కుమారుడు చల్ల సాగర్-శతి దంపతుల కుమారుడి మొదటి జన్మదిన వేడుకలకు మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ పాల్గొని చిన్నారి బాలుడిని ఆశీర్వదించారు.ఆమె వెంట మండల పార్టీ అధ్యక్షుడు పొత్తుపెద్ది కిషన్ రెడ్డి, ఎంపీపీ జక్కుల ముత్తయ్య. వైస్ ఎంపీపీ సుధాటి రవీందర్ రావు, తదితరు లున్నారు.



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పుట్ట శైలజ

గాయత్రి కళాశాలలో బతుకమ్మ వేడుకలు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. డిగ్రీ కళాశాల విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో రకరకాల పువ్వులతో బతుకమ్మను పేర్చి సంబరాలు చేసుకున్నారు. ఈ వేడుకల్లో గాయత్రి విద్యానికేతన్ చైర్మన్ అల్లంకి రజనీ శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మన ఆచార సాంప్రదాయాలలో భాగమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయురాలు శారద, రజిత, శ్రీవిద్య, ఆమని, సరస్వతి, రవళి, ప్రిన్సిపల్ రవీందర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నవిద్యార్థులు

బీఎస్పీలో భారీగా చేరికలు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్

బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష సమక్షంలో ఉప్పంపల్లి, గోపరపల్లి, లంబాడి తండా, రేగేడి మద్దికుంట, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున బీఎస్పీలో చేరారు. దాసరి ఉష వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కాంపల్లి బాబు, ఓదెల మండల నాయకులు కళ్యాణ మహేష్, పిట్టల శివ, దొడ్డి అశోక్, బీరం రవి, గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బీఎస్పీలో చేరిన నాయకులు

న్యూ ఇండియా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తిరుపతి



తిరుపతిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తున్న నాయకులు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్ :

న్యూ ఇండియా పార్టీ పెద్దపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా జనగామ తిరుపతిని సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. న్యూ ఇండియా పార్టీ రాష్ట్ర కన్వీనర్‌గా జనగామ తిరుపతి పార్టీ బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రజా ఉద్యమాలు చేస్తున్న జనగామ తిరుపతిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రెసిడెంట్ కలరాజు పటేల్,ఉపాధ్యక్షులు అశోక్ వేముల,కేంద్ర నాయకుడు నీరటి శంకర్,రాష్ట్ర కార్యదర్శి చాణక్య పాల్గొన్నారు.

23 సంవత్సరాలకు అంతా కలిశారు

నవతెలంగాణ-భైంసా



23 సంవత్సరాలకు, విద్యార్థులు వారికి చదువు చెప్పిన గురువులు అంతా ఒకచోట కలిశారు. తమ మధుర స్మృతులను గుర్తు చేసుకొని, దినమంతా సంతోషంగా గడిపారు. భైంసా మండలంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు గురువులను సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు దేవారెడ్డి, ప్రకాష్ బేలే, వామన్‌రావు, సుజాత, శోభ, వందన, తో పాటు 1999-2000బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనం చేసిన ఘటన మావల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మావల పోలీసులు తెలిపిన ప్రకారం పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసముండే కొమురయ్య భైంసా ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. శని, ఆదివారం సెలవులు ఉండటంతో ఆదిలాబాద్ కు వచ్చారు. ఆదివారం ఉదయం పట్టణంలో జరిగే ఓ కార్యక్రమానికి వెళ్లాడు. ఇంట్లో ఉండే కోడలు సైతం రాత్రి 7 గంటల ప్రాంతంలో స్థానిక దుర్గామాత ఆలయానికి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉండడంతో కొమురయ్యకు సమాచారం అందించింది. వెంటనే ఆయన ఇంటికి చేరుకోగా దొంగతనం జరిగినట్లు గ్రహించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. పదిహేను తులాల బంగారం 80 తులాల వెండి దొంగతనానికి గురైనట్లు తెలిపారు. వీటి విలువ దాదాపు రూ. 8 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. సోమవారం కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

పార్టీ కోసం సైనికుల్లా పని చేయాలి



నవతెలంగాణ-నేరడిగొండ

పార్టీ కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి గోడం నగేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో స్థానిక ఓ ఫంక్షన్ హాలులో మండల కార్యకర్తల సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పార్టీ పని చేస్తుందన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మేనిఫెస్టో రూపొందించి ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, నేరడిగొండ, ఇచ్చోడ ఎంపీపీలు సజన్ రాథోడ్, నిమ్మల ప్రీతం రెడ్డి, మండల కన్వీనర్ శివ రెడ్డి, తాంసి, భీంపూర్ జెడ్పీటీసీలు తాటిపెల్లి రాజు, సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రుక్మణ్ సింగ్, వైస్ ఎంపీపీ మహేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పెంట వెంకటరమణ, నాయకులు శ్రీధర్ రెడ్డి, బోథ్ అధికార ప్రతినిధి మోట్టె కిరణ్, ఉపసర్పంచ్ దేవేందర్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సర్పే సోంబాయి , మాజీ జెడ్పీటీసీ జహీర్, ఎంపీటీసీ పండరి, వీడీసీ చైర్మెన్ రవీందర్ రెడ్డి, పీసీసీ చైర్మెన్ నర్సింగ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అడ్డుకున్న సీతారాంపల్లి గ్రామస్తులు

నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు సీతారాంపల్లిలో ఇంటింటికి బీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే దివాకర్ రావు పర్యటించగా గ్రామస్తులు ఆయనను అడ్డుకొని ప్రశ్నించారు. దాదాపు 200 కుటుంబాలకు మురుగు కాలువ లేక లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారని వారు మండిపడ్డారు. 20 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న వారు అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. వర్షాకాలం వచ్చిందంటే ఇళ్లలోకి నీరు చేరి బయటకు రాని పరిస్థితులు ఉన్నాయని మున్సిపల్ కమిషనర్, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేసిన పట్టించుకున్న నాథుడే కరువయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో తప్ప మేము గుర్తురామని ప్రశ్నించారు. ఎమ్మెల్యేతో వాగ్వాదం జరిగినప్పుడు స్థానికులు కెమెరాలో వీడియో తీస్తుండగా దానిని కార్యకర్తలు అడ్డుకోవడంతో కొంతమేర ఘర్షణకు దారితీసింది. ఎమ్మెల్యే దివాకర్ రావు స్పందించి రానున్న మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఘర్షణ సద్దుమణిగింది. బీఫామ్ తీసుకున్న తర్వాత మొదటి రోజే ప్రజల్లో వ్యతిరేకత రావడంతో 20వ వార్డు బీఆర్ఎస్ నాయకులపై ఎమ్మెల్యే గుర్రుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ దూకుడు

నవ తెలంగాణ- పెద్దపల్లి

ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి దూకుడు పెంచింది. 15న ఎమ్మెల్యేల అభ్యర్థుల తొలి జాబితాలో 55 మంది అభ్యర్థులను ప్రకటించింది. అభ్యర్థుల ప్రకటన చేసిన వారి నియో జకవర్గాల్లో ఈ నెల 18 నుంచి ఏఐసీసీ ఆధ్వర్యంలో అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సీఎల్పీ నేత భట్టి విక్రమార్క బస్సు యాత్ర ద్వారా పర్యటించనున్నారు. పెద్దపెల్లి జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు కలిపి పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ ప్రచారం ఆరంభం

రాష్ట్రంలో అధికార పార్టీ బీఆర్ఎస్ నెల రోజుల క్రితమే ఎమ్మెల్యేల అభ్యర్థుల ప్రకటించింది. ఎమ్మెల్యే అభ్యర్థులు తమ నియోజక వర్గాల్లో ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభ్యర్థులకు 15న నుంచి బీఫా మ్స్ అందజేస్తున్నారు. ఆదివారం రోజున హుస్నాబాద్ నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రచారం ప్రారంభిం చారు. బీఆర్ఎస్ ధీటుగా కాంగ్రెస్ కూడా ప్రచా రంలో దూకుడు పెంచింది. కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టనుంది. అందులో భాగంగా ఈనెల 18న జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొండ గట్టు నుంచి రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ లు బస్సుయాత్ర ప్రారంభించను న్నారు. 19న పెద్దపెల్లి జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించ తలపెట్టారు.

భారీ జన సమీకరణకు అభ్యర్థులు ఏర్పాట్లు

ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పెద్దపెల్లి జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థులు తమ నియోజకవర్గాల నుంచి సభకు భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. బహిరంగ సభ సభాస్థలిని ఏఐసీసీ నాయకులు రోహిత్ చౌదరి సుశాంత్ మిశ్రా పెద్దపల్లి నియోజకవర్గ అభ్యర్థి విజయరామరావు సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సభకు పెద్దపల్లి జిల్లాలో ని మంథని పెద్దపల్లి, రామగుండం, ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ అభ్యర్థులు తమ నియోజకవర్గాల నుంచి భారీగా జనాన్ని తలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరు గ్యారంటీలపై వివరించనున్న రాహుల్

ఈ బహిరంగ సభలో ఎన్నికలకు కోసం కాంగ్రెస్ ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ స్కీమ్‌ల గురించి రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రజలకు వివరించనున్నారు.

ఆహారం కోసం వలస వచ్చిన బాతులు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలో వరి కోతలు ప్రారంభం కావడంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి బాతుల యజమానులు వాటి ఆహారం కోసం వలస వస్తున్నారు. వరి కోతలు పూర్తి అయిన తర్వాత పంట పొలాలలో కిందపడ్డ ధాన్యం గింజలను బాతులు ఆహారంగా తీసుకుంటున్నాయి. దగ్గరలో ఉన్న నీటి గుంటల వద్ద దప్పిక తీర్చుకొని తిరిగి పంటలు పూర్తయిన పొలాలలోని గింజలను వాటి ఆహారాన్ని తీర్చుకుంటున్నాయి. వందల సంఖ్యలో బాతులు వస్తుండడంతో వారు పంట పొలాలలోనే గుడారాలను వేసుకొని వాటి రక్షణ కోసం జాలీలలో ఉంచుతున్నారు. రెండు మూడు రోజులకు మారు బాతుల గుడ్లను జమ చేసి తిరిగి వాటిని ట్రైన్లో నెల్లూరుకు పంపుతామని వారు పేర్కొన్నారు. తెలంగాణ జిల్లాలో ప్రత్యేకంగా నిజామాబాద్ జిల్లాలో వరి పంటలు ఎక్కువగా పండించడం వల్ల వాటి ఆహారాన్ని తీర్చడానికి వారు ప్రతి ఏటా వాటిని ఇక్కడికి తీసుకువస్తూ ఉంటామని తెలిపారు. మండలంలోని పలు గ్రామాలతో పాటు, బోధన్, ఎడపల్లి, నవీపేట్ మండలాలలో సైతం వారు వలస వచ్చి బాతుల ఆహారాన్ని అందించనున్నట్లు తెలిపారు.

ఈవీఎం, వీవీ పాట్లపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సెక్టార్, పోలింగ్ అధికారులు ఈవీఎం, వీవీ ప్యాట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీఓ సురేష్‌లతో కలిసి మాస్టర్ ట్రైనర్లు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమైనదని, సెక్టార్ అధికారులు, పోలింగ్ అధికారులు ఈవీఎం, వీవీ ప్యాట్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శాసనసభ నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా నవంబర్ 3న నోటిఫికేషన్ విడుదల, 10న నామినేషన్ చివరి గడువు, 13న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్ల ఉపసంహరణ, 30న పోలింగ్, డిసెంబర్ 3న కౌంటింగ్ జరుగుతాయన్నారు. ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 48, సిర్పూర్ నియోజకవర్గంలో 39 సెక్టర్లు ఏర్పాటు చేసి 87 మంది సెక్టర్ అధికారులను నియమించామన్నారు. మాస్టర్ ట్రైనర్లు 2 నియోజకవర్గాల్లో నియోజకవర్గాల వారీగా రెండు రోజుల పాటు ఈవీఎం, వీవీ ప్యాట్లపై సెక్టార్ అధికారులకు శిక్షణ ఇవ్వాలని, పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. పోలింగ్ రోజున ఎక్కడైనా ఈవీఎం, వీవీ ప్యాట్లు అధికారులు వారి వద్ద రిజర్వుగా ఉన్న వాటిని వెంటనే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ మద్యం

నవతెలంగాణ-దిలావర్‌పూర్



ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చేపడుతున్న తనిఖీల్లో మద్యం, ఆధారాలు లేని డబ్బు పట్టుబడుతున్నాయి. సోమవారం మండల కేంద్రంలో తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ముక్కెర బుచ్చన్న రూ. 4,500 విలువ గల మద్యాన్ని వంజర్ గ్రామానికి తరలిస్తుండగా పట్టుపడ్డారని తెలిపారు. పట్టుబడిన వ్యక్తిపై పోలీసు కేసు నమోదు చేసినట్టు ఎస్సై యాసిత్ అరాఫత్ తెలిపారు. అక్రమంగా ఇతర ప్రాంతాలకు మద్యం, ఎక్కువ మొత్తంలో డబ్బు గాని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

కుభీర్ : మండలంలోని మర్లగొండ గ్రామంలో అక్రమంగా మద్యం నిల్వ చేసిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. సమాచారం మేరకు సోమవారం గ్రామంలోని ఓ ఇంట్లో సోదాలు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉన్న 25 లిటర్స్ బాటిల్స్ స్వాధీనం చేసుకొని ఒక్కరిపై కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. దీని విలువ సుమారు రూ.10 వేల 500 వరకు ఉంటుందన్నారు. అక్రమంగా మద్యం విక్రయించిన, నిల్వ చేసిన చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యాకలపాలు కొనసాగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

సిర్పూర్(టి) : ఎన్నికల సమయంలో ప్రజలు ఎవరైన కూడా ఎన్నికల కమీషన్ ఆదేశాలను ఉల్లంఘించి దేశీయ మద్యం, నాటుసారా, గుడుంబా, గంజాయి, ఇతరత్ర మత్తు పానియాలు అమ్మడం కానీ, అక్రమంగా తయారుచేసిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై దీకొండ రమేష్ హెచ్చరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సిర్పూర్ గ్రామంలో సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సమాచారం మేరకు గొల్లవాడకు చెందిన ఎర్ర అశోక్ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్నాడు. సోదాలు నిర్వహించి అతని వద్ద 66 దేశీదారు మద్యం సీసాలను పట్టుకున్నట్టు, వీటి విలువ సుమారు రూ.8690 ఉంటుందని తెలిపారు.





విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-బేల



వ్యవసాయ రంగానికి 24 గంటల, ప్రజలకు నిరంతర కరెంటు ఇస్తానని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి ఆరోపించారు. తరచూ విద్యుత్ సమస్యతో బేల మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఏఈ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సామ రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ సమయపాలన లేకుండా ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారన్నారు. ఆదివారం సాయంత్రం 7:00 గంటలు విద్యుత్ సరఫరా లేకపోవడంతో దేవి నవరాత్రి ఉత్సవాల సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. చీకట్లోనే దేవికి పూజలు నిర్వహించారని గుర్తు చేశారు. 33/11 మెయిన్ లైన్స్‌లో సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లక్ష్మీపూర్ నుంచి బేల వరకు వచ్చే లైన్‌లో స్పెషల్ డ్రైవ్‌తో మరమ్మత్తులు చేపట్టాలన్నారు. సమస్య వచ్చినప్పుడు గంటల తరబడి రాత్రి వేళలో మరమ్మత్తులు చేసే బదులు ముందే సర్వే చేయించాలని సూచించారు. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ముందు జాగ్రత్త తీసుకున్న వారవుతారని తెలిపారు. బేల మండల కేంద్రంలో ఇష్టారాజ్యంగా ఎల్‌సీలు తీసుకోవడంతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి అధికారులు ఫోన్ పని చేసేలా చర్యలు తీసుకోవాలని, కానీ అధికారులు ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటంతో ఎవరికి చెప్పాలో తెలియడం లేదన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అఖిల్, రాకె విపిన్, కన్య రాజు, విలాస్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో స్వామి అనే వ్యక్తి నుంచి రెండు లక్షల రూపాయల నగదు ను సోమవారం పట్టుకున్నట్లు ఏసై మురళి తెలిపారు. బీబీపేట మండలం లోని మల్కాపూర్ గ్రామానికి చెందిన స్వామి తన కారులో దోమకొండ మండల కేంద్రం మీదుగా వెళుతున్న క్రమంలో నగదు ను పట్టుకొని విచారణ చేయగా 2 లక్షల నగదు కు ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని స్వాదినం చేసుకొని ఫ్లాయింగ్ స్వాడ్ బృందనికి అప్పగించినట్టు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఎన్నికలను బహిష్కరిస్తాం



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గత 2016 సంవత్సరంలోనే మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేయడంతో పాటు జిల్లా అధికారులకు ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందని పల్సి గ్రామస్తులు తెలిపారు. పల్సి మండలంగా ఏర్పాటు చేయాలని గత 5రోజుల నుంచి చేపట్టిన రిలే నిరాహార దీక్షాలకు సోమవారం పల్సి గ్రామంలో ఉన్న రైతులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మండలం ఏర్పాటు చేయాలని కోరామని అన్నారు. ప్రభుత్వ వైఖరి నిర్లక్షంగా వ్యవరించడంతో పల్సి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయక పోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ దీక్షలు ఇలాగే కొనసాగించి రానున్న ఎన్నికలకు గ్రామస్తులు అందరూ బహిష్కరిస్తామని అన్నారు. అదే విధంగా తక్షణమే ప్రభుత్వం పల్సిని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు వివిధ రూపాల్లో సమ్మెలు, ధర్నాలు, చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పల్సి గ్రామ రైతులు యువకులు ఉన్నారు.

ఎస్టీ హోదా సాధించే వరకు మాలీల పోరాటం



నవతెలంగాణ-తాంసి

మాలీలకు ఎస్టీ హోదా లభించే వరకు మాలీ కులస్తులు విశ్రమించబోరని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. మాలీ సంఘం జెండా పండుగ వారోత్సవాలు భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జెండా పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, ఫూలే విగ్రహానికి మాలీ సంఘం సభ్యులతో పాటు గ్రామ సర్పంచ్‌తో కలిసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 10అక్టోబర్ 2002న తాంసి మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మాలీ కులస్తులు ఏకమై మొదటిసారిగా మాలీ ఉద్యమ పతాకం ఎగరేసి ఉద్యమాన్ని ప్రారంభించామని అన్నారు. మాలీల ఉద్యమానికి తాంసి కేంద్ర బిందువని అన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య ఉద్యోగ రంగాల్లో వెనుకబడ్డ మాలీకులస్తులు గత 22 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసి సీఎం కేసీఆర్ చేత అసెంబ్లీలో తీర్మానం చేసి ఎస్టీ హోదా బిల్లు పార్లమెంటుకు పంపడంలో సఫలీకృతులయ్యారని, పార్లమెంట్‌లో ఆమోదం లభించిన వెంటనే మాలీకులస్తులు ఎస్టీలుగా మారుతారని, దానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, మాలీలది సామాజిక సమస్యని దీన్ని ఎవరు కూడా రాజకీయం చేయొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, జిల్లా అధ్యక్షులు విజయ్ వాడగురే, క్రాంతి జ్యోతి యువజన సంఘం అధ్యక్షులు కోట్రంగి అశోక్, గ్రామ పటేల్ చౌదరి నాగన్న, (మహాజన్) విఠల్, సత్యనారాయణ, ప్రవీణ్, దీపక్, ఆశన్న చౌదరి, మల్లన్న ఠాకరే దత్తు పాల్గొన్నారు.

ఆర్మీలా.. కలిసికట్టుగా పనిచేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

ఎన్నికల విధులలో నియమించిన అధికారులందరూ కలిసికట్టుగా ఆర్మీలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ నుండి రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్‌తో కలిసి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అధికారులందరూ తమకు అప్పగించిన పనులను సమర్ధవంతంగా నిర్వహిస్తామనే పూర్తి విశ్వాసంతో పనిచేయాలని హితవు చెప్పారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి వచ్చిన ఫారం-7,8 లను ఈ నెల 19 లోగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. జిల్లాలో 51 వేల నూతన ఓటరు ఎపిక్ కార్డుల పోస్టల్ శాఖ ద్వారా జరుగుచున్న పంపిణీపై దృష్టిపెట్టాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే నవంబర్ 10 వరకు ఓటరు నమోదు జరుగుతుందని, ఆ పిదప అనుబంధ ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. ఎన్నిక ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా అమలయ్యేలా చూడాలని, చెక్ పోస్టులపై నిఘా ఉంచి అనుమానస్పదంగా డబ్బు, మద్యం, కానుకలు తదితర రవాణా జరుగుచుంటే ఎవరిని ఉపేక్షించక స్వాధీనం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పోలింగ్‌కు 48 గంటల ముందు ఉల్లంఘనలు ఎక్కువగా జరిగే అవకాశముంటుందని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి రూట్ మ్యాప్ ఆధారంగా అన్ని పోలింగ్ బూతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మౌలిక వసతులున్నాయా తెలుసుకో వాలన్నారు. పోలింగ్ కేంద్రం తప్పని సరిగా గ్రౌండ్ ఫ్లోర్ లో ఉండేలా చూడాలని, లోపలికి ,బయటికి వెళ్లేలా దారులుండాలని, తప్పనిసరిగా వీల్ చైర్ ఉండేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఫర్నీచర్, మంచినీరు, టాయిలెట్స్ , లైటింగ్, ర్యాంపు ఉండేలా చూడాలని, పంచాయతీ కార్యదర్శుల సేవలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజు ఓటరు అవగాహన నిమిత్తం తప్పని సరిగా 4 రకాల పోస్టర్లు ప్రదర్శించాలన్నారు. పోలింగ్ శాతం తక్కువగా ఉన్న కేంద్రాలలో దృష్టిపెట్టాలన్నారు. సభలు, సమావేశాలకు సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో అనుమతులు మంజూరు చేయాలని, వాహనాల అనుమతికి జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. సామాజిక మద్యామాలలో వచ్చే బల్క్ ఎస్.ఎం.ఎస్. లకు అనుమతగులు, , అసత్య వార్తల కట్టడి చేయాలన్నారు. పోలింగ్ కు ముందు రోజు డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుండి ఈవీఎం , వివిప్యాట్ లు, మెన్ అండ్ మెటీరియల్ తరలింపునకు చక్కటి ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అదేవిధంగా రిసిప్షన్ సెంటర్ కు కూడా ప్లాన్ చేసుకోవాలన్నారు. ఏ సందేహాలున్నా నివృత్తి చేసుకోవాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారులు మను చౌదరి, ప్రభాకర్, శ్రీనివాస్, జిల్లా పరిషద్ సీఈఓ సాయ గౌడ్,కలెక్టరేట్ ఏ.ఓ. మసూర్ అహ్మద్, ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.